'బండిరాముడి పెళ్లాం'

మా గోఖలే

చెన్నపట్నంలో 'లా' చదువుతున్న గోపాలం ఆ ఏడు 'ఎఫ్ఎల్' పరీక్షకు కూచుని, వేసంగి సెలవలకు స్వగ్రామం మాధవపల్లికి బయలుదేరి, మర్నాడు పది ఘంటల ప్రొద్దెక్కేసరికి ఆ చిన్న స్టేషను గుండూరు చేరుకున్నాడు. గుండూరు స్టేషన్నుండి మాధవపల్లికి దాదాపు ఆరు మైళ్ళుంటుంది.

స్టేషన్లో దిగంగానే తనవూరు రాముడి గుర్రబ్బండి కోసం గాలించాడు గోపాలం. ఎక్కడా రాముడి బండిజాడ లేదు. ఇంకేవూరి బళ్ళయినా వుండొచ్చని ఆశతో చూసిన గోపాలానికి పుట్టింటికొస్తున్న ఓ ఆసామి ఆడకూతురుకోసం వచ్చిన ఒక్క రెండెడ్ల గూడుబండిమటుకే కనుపించింది.

దూరప్రయాణంచేసి స్వగ్రామానికొస్తున్న వుత్సాహమూ, ఉదయపువేళ మాగాణీప్రాంతపు శోభను చూసి పొందిన ఆనందమూ గోపాలం హృదయంలోంచి జారిపోవటం మొదలుపెట్టినై.

స్టేషన్లో దిగిన ప్రయాణీకులు పూర్వం మాదిరిగానే రంగు రంగుల ట్రంకు పెట్టెలూ, మూటలూ నెత్తి కెత్తుకుని డొంక వెంబడి చుట్టుపక్కల పల్లెటూళ్ళకు కులాసాగా నడిచిపోతుంటం చూసి నిట్టూర్చాడు గోపాలం.

"ఏవూరు ?"

ఉలిక్కిపడి వెనక్కు తిరిగి చూశాడు గోపాలం. మెడ మీద చేతికర్రకు రెండు చేతులూ వేళ్ళాడేసుకుని మెళ్లో వెండికంటెతో ఓ నల్ల పిల్లవాడు గోపాలాన్ని పరీక్షగా నిలబడి చూస్తున్నాడు.

'నువు మాదవపల్లి అనుమంతయ్యగారి రశ్యాయివి కదూ ?' మళ్ళీ అడిగాడా నల్లపిల్లవాడు.

'అవును. నీకెట్టా తెల్సా ?' అనడిగాడు గోపాలం నల్లపిల్లవాణ్ణి వింతగా చూస్తూ......

'నాకు తెల్సు. ఎనక నువ్వు మీఅయ్యా, అమ్మతో రాముడి గుర్రబ్బండిలో వచ్చి తెనాలి పోయిరాటం సానాసార్లు సూశా. ఇప్పుడు చూటు, బూటు మీదుంటే సప్పున గురుతుపట్టిలా నిన్ను' అన్నాడు నల్లపిల్లవాడు.

'మంచివాడివే. మావూరి రాముడి గుర్రబ్బండి ఎందుకు రాలేదో నీకు తెలుసా ? వాడీ పాసింజరు టైముకు ఎప్పుడూ ఇక్కడుండేవాడే ?' అనడిగాడు గోపాలం.

'రాముడు గుర్రబ్బండి అమ్ముకుని ఒంటెద్దుబండి కొన్నాడుగా. మీవూర్నించి ఇటుగా తెనాలికి బస్సు పడింది నీకు తెల్సా ?' అన్నాడు నల్లపిల్లవాడు.

'నాకు తెలియదు. ఏదీ బస్సా?' అనడిగాడు గోపాలం, బస్సులు దేశం నాలుగుమూలలకూ ఎగ బాకుతున్నయ్యనుకుంటూ.

'అఁవ్, అది వుత్త సన్నాసి బస్సు. యాడన్నా కూసేపు ఆగిందంటే మళ్లి. మడుసులు తోత్తేగాని కదల్దు. ఇంతకు ముంగలే ఆ బస్సులో కూకున్న మడుసులు దాన్ని తెనాలేపుకు తోసుకెళ్లారు. మరి తిరిగి ఎప్పా డొచ్చుద్దో? అదుగో, అదుగో రాముడి బండొత్తున్నది' అంటూ రోడ్డువేపుకు వేలుపెట్టి చూపించాడు నల్లపిల్లవాడు.

తెనాలి వెళ్ళే పెద్దరోడ్డునుంచి స్టేషనుకు వచ్చే చిన్నరోడ్డుకు మళ్ళించి, బండినీ, ఎద్దునూ పగ్గాల్తో లాక్కొస్తున్న రాముణ్ణి చూశాడు గోపాలం.

రాముడి ఒంటెద్దు బండిని చూసి గోపాలం నీళ్ళు కారిపోయినా, తనకు గుండూరు స్టేషన్నుంచి విముక్తి కలుగుతున్నందుకు సంతోషం తెచ్చుకున్నాడు.

బండిలో వచ్చిన తన వూరు కోమటి కోటమ్మ, కోటమ్మ మనమరాలు అక్కమ్మను చూడగానే కోటమ్మ దుకాణం చప్పున జ్ఞాపకానికొచ్చింది గోపాలానికి.

కోటమ్మకు ఓ కన్ను కాయకాచి ఇంకో కన్ను మసగ్గా కనుపిస్తుంది. వెనక తను ఓ చెల్లని అర్ధ రూపాయీ, ఇంకో సత్తుపావలా కోటమ్మ కొట్లో మార్చుకోటమే కాకుండా తను అడిగిన కడియారం సిగిరెట్లకు కోటమ్మ పక్కకు తిరిగి గోనెసంచులు వెతుకుతుంటే చల్లగా తను అందినంతవరకు గల్లాపెట్టెలో చిల్లర డబ్బుల్ని జేబులో వేసుకోటం గుర్తుకొచ్చి నవ్వుకున్నాడు గోపాలం.

'నాయనా! నువ్వు భానుమంతయ్యగారబ్బాయి గోపాలానివి కాదూ? బాగున్నావా? చెన్నాపట్టంలో ప్లీడరీ చదువుతున్నావంటగా? పోనీలే. మనవరాల్ని అత్తారింటికి తీసుకెళ్తున్నా' అని గోపాలాన్ని పలకరించి, మనమరాలు పెట్టెబేడతో ప్లాట్‌ఫారంమీద కెళ్ళింది కోటమ్మ.

'ఏం అబ్బాయిగారూ? బాగుండారా? నాన మూడు దినాల కిందటే చెప్పాడు తమరొస్తుండారని. ఎక్కాం బండెక్కండి' అంటూ బండిలో గోనెపట్టా దులిపేసి, గోపాలం సామాన్లు బండిలో సర్ది, ఎద్దు పగ్గాలు పట్టుకుని ప్రయాణానికి సిద్ధమైనాడు రాముడు.

గోపాలం విసిరేసిన అణాబిళ్ళను గుప్పెట్లో కరుచుకుని, కూతేసుకుంటూ స్టేషన్లోకి పరుగెత్తి మాయమైనాడు వల్లపిల్లవాడు.

ఊరుదాటినాక బండెక్కి కూచుని, రాముణ్ణి బండెక్కవేమనడిగాడు గోపాలం.

'నేను బండెక్కితే ఎద్దు చెప్పినమాట వినదు. కాస్త ముందుకొచ్చి కూకోండి' అంటూ ఎద్దునదిలిస్తూ బండికిపక్కనే నడిచాడు రాముడు.

'నిన్న ఈ ఒంటెద్దుబండి పట్టుకుందేరా, రాముడూ? గుర్రబ్బండి అమ్మేశావుట దేనికి?' అనడిగాడు గోపాలం, రోడ్డు గతుకులకు బండిలో అటీటూ వూగుతూ.

'గుర్రంచస్తే బండినమ్మేశా' అన్నాడు రాముడు.

'నిక్షేపమంటి గుర్రమే! ఏం, ఎందుకు చచ్చిందీ? ముసల్దయిందా?' అనడిగాడు గోపాలం, రోడ్డు పక్కనే వస్తున్న తంగేడుచెట్లను చూస్తూ.

'అప్పుడే ముసల్దా? అది బతికుంటే ఇంకా పది పదిహేనేళ్ళు బతికేది. ఎండుగడ్డీ, కుడితినీళ్ళూ పోస్తే ఏగుర్రమన్నా బతుకుద్దా?' అన్నాడు రాముడు.

'నీగుర్రం ఏం తినేదేం?' గుర్రాలు ఏంతింటయ్యో గోపాలం బుద్ధికి చప్పున పెగిలిరాలేదు.

'అన్ని గుర్రాలల్లే నా గుర్రమూ పచ్చిగడ్డీ, వులవ గుగ్గిళ్ళూ తినేది. మనూర్నుంచి తెనాలికోటీ, గుంటూరు కోటీ రెండు బస్సులేశారు. మీకు తెల్సా? అప్పట్నుంచి బండిబాడిగలు పడిపోయినై. నాకాడ డబ్బు లెగలక ఎండుగడ్డి వెయ్యటం మొదలుపెట్టేసరికి సరిగ్గా తినక మాడిచచ్చింది గుర్రం' అన్నాడు రాముడు, ఎద్దుతోక మెలిపెట్టి, 'పదవేందే నిదరమొగందానా' అని అదిలిస్తూ.

రాముడితో సానుభూతిగా ఏమన్నా అందామనిపించి, ఏం తోచక, రాముణ్ణీ, తోకనెప్పితో ఎగుర్తూ మొరాయిస్తున్న ఎద్దునీ ఓసారిచూసి, రోడ్డుపక్కకు దృష్టి మళ్ళించాడు గోపాలం.

పల్లగావున్న మాగాణి చేలల్లో రైతుకూలీలు గడ్డ విరుస్తున్నారు. వాళ్ళ నల్లటి దేహాలు చమటకు ఎండలో నిగనిగ మెరుస్తున్నయ్. చేలల్లో అక్కడక్కడ ఆసాములు తాటాకు పందిళ్ళువేసి, చేల బలం కోసం పశువుల్ని కట్టేశారు. కొంచెం వెనకాల చెట్ల మధ్యగా చిన్న పల్లెటూరు నున్నపుగోడలూ, గడ్డివాములూ, ఓచిన్న గుడిగోపురం కనపిస్తున్నయ్. ఎద్దుఒళ్ళూ, రాముడి బనీనూ, చమటకు తడిసినై. రాముడూ, ఎద్దూ ఒకరి ప్రక్కన ఒకరు లయప్రకారం నడుస్తున్నారు.

'అబ్బ! ఎండ చిటచిట్లాడిస్తున్నది. ఎండలో అవిధంగా ఎందుకు నడుస్తావు బండెక్కితోలరాదూ?' మళ్ళీ అడిగాడు గోపాలం రాముణ్ణి.

'కొత్తెద్దు కదండీ? ఇంకా దానికి బెదురుపోలేదు. వున్నట్లుండి సైడుకాలవలోకి లాగుద్ది. ఓసారి అంతే పనైందికూడా. దాని దర్మాన ఎవరికీ పెద్ద దెబ్బలు తగల్లేదు లెండి' అన్నాడు రాముడు.

'అబ్బ! కొన్ని యుగాలు ప్రయాణం చేస్తున్నట్టుందీ ఒంటెద్దుబండిలో. గతుకు గతుక్కీ తలపగుల్తుంటం అట్లావుంచు, మరి నీ సంగతేమిట్రా రాముడూ? ఈ తాబేలు నడకతో నీవృత్తికేమంత లాభంగావుంటుందీ? గుర్రబ్బండి వున్నప్పుడు నీకింత కష్టం వుండేదికాదనుకుంటా. నువ్వుతొందరగా ఈ ఒంటెద్దుబండిని ఒదిలించుకుని ఇంకోపని చూసుకోటం మంచిది' అన్నాడు గోపాలం.

'నా వెళ్లామూ ఇదేమాటంటుంది. అయినా ఇన్నేళ్లు బండిపనికి అలవాటుపడి యిప్పుడు తెలవని కొత్తపని చేయడం నావల్లవవుతుందా? వృత్తిది. కాని గుర్రబ్బండి తోల్తున్నప్పుడు నిజానికింత ఇబ్బందుండేదికాదు. ఇప్పుడీ బస్సులు పడినాక గుర్రం బతికేటంకూడా వృత్తకండగ. రోజులు చాలకపోతే మనుషులు వరన్నం బదులు జొన్నకూడో, నాగికేముకు గుబ్బలో తిన్నా తింటారు గాని గుర్రం పచ్చిగడ్డి మానేసి ఎండుగడ్డి తినమంటే తింటుందా? అందుకే అది చచ్చింది' మణికట్టుతో మొహంమీద చమట పక్కకు నెట్టుకుంటూ మళ్ళీ అన్నాడు రాముడు. 'మొత్తం పన్నెండేళ్ళు బండి

లాగిందాగుర్రం. పన్నెండేళ్ళు రోజూ దానికి మాలీసు చేశాను. కన్నతల్లిగ్గూడా అంతచాకిరి చేసుండను!'

'ఏమిటో! మొహాన రాసిపెట్టినట్టే జరుగుతుంటుయ్ కొన్ని' అన్నాడు గోపాలం రాముణ్ణి జాలిగా చూస్తూ.

'ఉత్తది. యీపన్నా పచ్చగడ్డి, ఎండుగడ్డి సంగతి మొహాన రాసుంటుదా? ఉత్తది. నా పెళ్ళాం గూడా ఇదేమాటంటుంది. పిచ్చి సచ్చింది. చెప్పినా దానికి తెలవదు. అసలు దానికి మతెప్పుడో పోయింది' అన్నాడు రాముడు, బండిని రోడ్డుపక్కలకు లాగుతున్న ఎద్దును రెండు పీకి దారినపెడ్తూ.

'అన్నట్లు మరిచిపోయ్యాను. వెనక నీ పెళ్ళాం పోయిందని-' అని సగంలో ఆపాడు గోపాలం, సందేహిస్తూ.

'ఎవరు - నా మొదటి పెళ్లామా? అదెప్పుడో చచ్చిపోయిందిగా? ఇది రెండో పెళ్లాంలెండి' అన్నాడు రాముడు.

ఈ వేసంగిలో తనకొస్తున్న పెళ్ళి సంబంధాల్లో ఏదో ఒకటి ఖాయం కావచ్చుని యీమధ్య నాన్న చూచాయగా రాసాడు తనకు. అంటే దాదాపు ఏదో సంబంధం యీపాటికి ఖాయం గూడా చేసివుంటాడు నాన్న. పుర్రెలో ఏదన్నా తోలుస్తుంటే దాన్ని ఓదారికి తీసుకురావటం నాన్నకు అలవాటే. తను ఇంటికి వెళ్ళేటప్పటికి పెళ్ళి సామాన్లు సగం పైగా వన్నా నాన్న ఇంటో చేర్చివుంటా డనుకున్నాడు గోపాలం.

'నువే నయంరా, రాముడూ. సునాయాసంగా అప్పుడే రెండో పెళ్లి గూడా చేసేసుకున్నావు!' అన్నాడు గోపాలం, ఇంకా మాధవపల్లి ఎంతదూరం వుందోనని తొంగిచూస్తూ.

'నిజంగా యీ పెళ్ళి అనుకోకుండానే జరిగింది లెండి. నిచ్చేపమంటిది కాస్తా నా జీవానపడి ఏడ్సింది' అన్నాడు రాముడు.

'నిక్షేపమంటిదైతే ఇంకా ఏం? దాన్ని పువ్వును చూసినట్టు చూసుకో' అన్నాడు గోపాలం నవ్వుతూ.

'మనూరెళ్ళినాక మీకన్నీ తెలుస్తయ్. ఈ పెళ్ళిని గురించి మనూళ్లో నన్ను నానామంది నానామాట లన్నారు. అయన్నీ మీరేం ఇనిపిచ్చుకోబాకండి, అబ్బాయిగారూ' అన్నాడు రాముడు, గోపాలంవేపు ఓసారి తిరిగి చూస్తూ.

'పుణ్యానికి నువు పెళ్ళిచేసుకుంటే వూళ్ళోవారు ఆడిపోసుకోటం దేనికి? ఏం అంత విశేషం వుందా నీ పెళ్ళిలో?' సరదాగా అన్నాడు గోపాలం.

'నా పెళ్ళప్పటికే దానికి కడుపైంది.'

'ఎవరికి?'

'అదేలెండి - నా పెళ్ళానికి. అదే నేను ముంగల మీతో చెప్పింది. వూరెళ్ళినాక యిన్నీ మీకు తెలుస్తయ్యని' అన్నాడు రాముడు.

'చచ్చాం. అదేమిట్రా రాముడూ?'

'అదంతేలెండి, అబ్బాయిగారూ. దాన్ని పిచ్చిదాన్ని చేసి ఎవడో ఎదవ దానికి కడుపుచేశాడు. ఇంక దానికి పెళ్ళి ఎట్టవుద్ది? అది మంచిపిల్లని వూళ్ళో అందరికీ తెలుసు. పెళ్ళి సంగతి దేముడికెరుక. అసలు ఆడకూతురన్నది ఎట్టా తలెత్తుకు తిరుగుతుంది నలుగుర్లో? సిగ్గుతో పగలంతా అళ్ళ గుడిసెలోనే కూకునేది ఏడుస్తా.'

'చాలా అన్యాయం' అన్నాడు గోపాలం, రాముణ్ణిచూస్తూ.

'అన్యాయమని మెల్లిగా అంటారేం? ఓరోజు వాళ్ళ గుడిసెకు దాని అయ్యతో పనుండి వెళ్ళినట్టులోనే నన్ను జూసి బావురుమంది. నాకు తల తిరిగిపోయింది, నిజంచెప్పద్దూ? దాని అయ్యా, అమ్మోళ్ళకు దాన్ని సంపాలో, దాచిపెట్టుకోవాలో తెలవలేదు. అదేమాటన్నాడు దాని అయ్య, కర్రోటి తీసుకుని. ఈ జాతరంతా దేనికీ దానికిష్టమైతే నేనే పెళ్ళిచేసుకుంటానన్నా. ఇగనంతే. అమాంతంగా వచ్చి నన్ను వాటేసుకుంది' అన్నాడు రాముడు.

'ఆపాటు పెళ్ళిచేసుకున్నా వన్నమాట?'

'ఆ! అందులో ఇంక చచ్చేంలేదు. పెళ్ళికి వచ్చినోరు వచ్చారు, రానోళ్ళ గురించి నేనంతగా పట్టించుకోలేదు. అసలు తిమాశ ఎక్కడుందంటే దాని కసలు నేనే కడుపుచేశానని వూళ్లో పుకారు పుట్టించారు', అన్నాడు రాముడు పెద్దగా నవ్వుతూ.

రాముణ్ణి కొత్తమనిషిగా దిమ్మరబోయి చూశాడు గోపాలం.

'నువు చాలా ధైర్యస్తుడివి. నువు చేసినపని ఇంకోడివల్లకాదు. ఆ భ్రష్టుడెవడో నరికెయ్యకపోయినా వాణ్ణి?' అన్నాడు గోపాలం.

'ఇంతకీ వాడెవడో తెలియలేదుగా?' అన్నాడు రాముడు.

'ఆదేమిటి ? నీ పెళ్ళాం చెప్పలామరి?' అడిగాడు గోపాలం.

'రెండుమూడుసార్లు అడుగుతే చెప్పలా. తనకు ఇంతవరకైనాక వాడెవడవ్వుతేమట్టు కేమంది. ఆజాతరంతా మళ్ళీదేనికంటుంది. బలే మొండి', అన్నాడు రాముడు.

దారిలో అడ్డుతగిలే ట్రంకురోడ్డుమీద అడ్డంగా వచ్చిన బస్సును తప్పించుకుని మాధవపల్లి రోడ్డుకు బండిని మళ్ళించాడు రాముడు. గోపాలం ఆత్రంగా 'ఒరేయ్ రాముడూ, అదిగో అక్కడ మా పొలాలదగ్గిర పాడుగా నుంచుంది, మానాన్నల్లే వుంది, సరిగ్గా మాడూ ?' అంటూ బండి దిగాడు గోపాలం.

... ...

గోపాలం కొంచెం స్థిమితంగా వుంటంచూసి, తాము దాదాపు ఖాయంచేసిన పెళ్ళిసంబంధాన్ని గురించిన వివరాలు చెప్పారు అమ్మా, నాన్నలు. పడుచువాడి కుండాల్సిన వుద్రేకాలన్నీవున్న గోపాలానికి అందమైన పెళ్ళాం కావాలనే కోరికతప్ప తనపెళ్ళికి కాల పరిమితులు అడ్డంపెట్టాలనే ఆలోచన లేదు. తనకు కాబోయ్యే పెళ్ళాన్నిగురించీ, ఆమెతో తనకు కలగబోయ్యే సంపర్కంగురించీ వింతవింత వూహలు చేసుకుంటూ డాబామీద పచార్లుచేస్తున్న గోపాలం తమ దొడ్లో బావిలోంచి మంచినీళ్ళు తోడుకువెళ్తున్న మంగనుచూసి వుద్రేకంతో అపాదమస్తకం కంపించి పోయ్యాడు. తను పట్నంనుంచి వచ్చినట్టు మంగకు తెలిసుంటుంది. తను డాబామీద తిరుగుతూంటం కూడా చూసుంటుంది. అందుకే మంచినీళ్ళ మిషతో దొడ్లో బావిదగ్గిరకొచ్చింది. అయినా మంగ తనను చూడనట్టు తల ఒంచుకుపోవటం గోపాలానికంత రుచించలేదు.

గబగబ కిందికి దిగిపోయి, నాన్న వూళ్లోకి పనిమీద పోవటం, అమ్మ పొరుగింటివాళ్లో ఏదో లోకాభిరామాయణం సాగిస్తుంటం తెలుసుకుని, ఓతుండుగుడ్డ బుజాన వేసుకుని నీళ్ళగదిలో స్నానం చేయటాని కొచ్చాడు గోపాలం. నీళ్ళగది పక్కనే దొడ్లో వుంది బావి. నీళ్ళ గదిలోకి తను వచ్చిన ద్వారాన్ని బంధించి దొడ్డి వేపునున్న ద్వారం దగ్గిరకొచ్చి నుంచున్నాడు గోపాలం వేడి శ్వాసలొదుల్తూ.

తీర్చినట్టు కనుముక్కు తీరూ, జారుముడీ, ఎర్ర చీర మోకాళ్ళపైగా దోపుకుని బావిదగ్గిర నుంచుని కడవకు చేంతాడు వుచ్చు బిగిస్తున్నది మంగ.

మంగ తనను చూసింది. బిగుసుకుపోతున్న తను మంగను చూసి వికారంగా నవ్వాడు.

'మాట' అన్నాడు తను, తడబడ్తూ అస్పష్టంగా.

నాగుమల్లె చువ్వలాగా అట్టాగే కదలకుండా నుంచుంది మంగ.

'ఇక్కడ ఎవరూ లేరు. ఒక్కమాట.' అన్నాడు తను.

బొమ్మల్లే ద్వారం దగ్గరికి మెల్లిగా వచ్చి నుంచుంది మంగ. మెరుస్తున్న మంగ కళ్ళు చూశాడు గోపాలం.

ఆకళ్ళలోంచి వదుల్తున్నది నిప్పుకణాలో కాము కణాలో, పోల్చుకోలేదు గోపాలం.

'లోపలికి రా...' అన్నాడు గోపాలం.

'నాకు పెళ్ళయింది, నీకు తెల్సా?' అంది మంగ, గోపాలాన్ని సూటిగా చూస్తూ.

'ఏం? పెళ్ళి చేసుకోటం తప్పా?' అన్నాడు గోపాలం.

'నువ్వు చేసినపనికి వన్నెవరూ పెళ్ళిసేసుకోనన్నారు' అంది మంగ కన్నార్పకుండా......

'పరవాలేదులే - ఒక్కసారి లోపలికిరా' -అంటూ వంగి ఎర్రచీర పట్టుకుని లాగాడు గోపాలం, మంగ లోంచి బుస్సున బుసరావటం వినిపించుకోకుండా.

ద్వారంకింద పగిల్న నాపరాతి ముక్కమీదకు చప్పున వెళ్ళిన మంగచెయ్యి చక్రాకారంగా తిరిగి గోపాలం నెత్తిమీదకు విసురుగా వెళ్ళిపడింది.

చిన్న కేక పెడ్తూ తలను రెండుచేతుల్తో పట్టుకుని అట్లాగే కిందికి జారిన గోపాలం కళ్ళల్లో ఎర్రతీగెల్లో ఎర్రచీరతో మంగా, మంగవెనక బండిరాముడూ తీగెలల్లే కదుల్తూ కనుపించారు.